హైదరాబాద్ వార్త



# నిత్య వరుణుడు

**కురుస్తూనే ఉన్నాడు.. నగరాన్ని వీడని వాన**



హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త : నగరాన్ని వరుణుడు వీడడం లేదు. సోమవారం సాయంత్రం మళ్లీ దంచికొట్టడంతో నగరవాసులు విలవిల్లాడారు. లోతట్టు ప్రాంతాలు, చాలా చోట్ల కాలనీలు నీట మునిగాయి. నగరంలోనే కాదు శివారుల్లోని వాగులు, వంకలు పొంగిపోర్లుతుండడంతో రవాణాకు అంతరాయం ఏర్పడింది. మలక్‌పేట, మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, ఎల్బీనగర్, వనస్థలిపురంతో పాటు పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట, బార్కాస్, బహుదూర్‌పురా, ఫలక్‌నుమా తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. రాజేంద్రనగర్, అత్తాపూర్, గండిపేట్, కిస్మత్‌పురా, శంషాబాద్, శివరాంపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. ప్రధాన మార్గాల్లో రోడ్లపైకి వరద నీరు చేరడంతో వాహన దారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరడంతో సాయంత్రం తమతమ నివాసాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, నాంపల్లి, కుషాయిగూడ, రాయదుర్గం, ఖాజా గూడ, కొత్తపేట తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై మోకాల్లోతు నీరు నిలిచింది. ఇప్పటికే చెరువులన్నీ దాదాపు నిండిపోవడంతో తాజా వర్షాలతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు. ఊహించని విధంగా కురిసిన వర్షానికి ఇళ్లకు వెళుతున్నవారు తడిసి ముద్దయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా.. భారీ మేఘాలు నగరాన్ని కమ్మేయడంతో చీకట్లు కమ్ముకున్నాయి.



రాజ్‌భవన్‌లో హర్‌ఘర్‌కా తిరంగా కార్యక్రమంలో మంగళవారం గవర్నర్ తమిళిసై జాతీయ జెండాలను ఉద్యోగులకు అందజేస్తున్న దృశ్యం

## సంక్షేమ హాస్టళ్ల..

# సమస్యలు పట్టవా..?

**వసతుల లేమిపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆవేదన**

**కనీస వసతులైనా కల్పించాలని వినతులు**

**డిఎస్‌సి కోచింగ్‌లకే ప్రాధాన్యమా?**



హైదరాబాద్ ఆగస్టు 2 ప్రభాతవార్త : ప్రభుత్వం ఉన్నత విద్యకు, నిరుద్యోగ కోచింగ్‌లకు ఇస్తున్న ప్రాధాన్యత పాఠశాల విద్యాశాఖకు ఇవ్వడం లేదా? డిఎస్‌సి, గ్రూప్‌వన్, గ్రూప్ 2 తదితర ఉన్నత విద్య కోచింగ్ కోసం వందల సంఖ్యలో కోచింగ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేయిస్తోందా.. అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. ఉన్నత విద్యకు కోచింగ్‌లకు ఇస్తున్న ప్రాధాన్యతను సంక్షేమ శాఖ హాస్టళ్లకు ఇవ్వాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అసలే కరోనా లాక్ డౌన్ తదితర పరిస్థితులు విద్యార్థులకు విద్య సరిగ్గా అందకుండా చేశాయని ఇప్పుడైనా హాస్టళ్ల గురించి పట్టించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధి వరకు పరిస్థితులు దయనీయంగానే ఉన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.

**హాస్టళ్లలో ఇదీ పరిస్థితి..** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో గల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు కనీస సౌకర్యాలను కల్పించలేక తీవ్ర అవస్థలను ఎదుర్కొంటున్నాయి. పేద మధ్యతరగతి ప్రజానీకమే ఈ హాస్టళ్లలో విద్యనభ్యసిస్తుండగా అధికారులు మాత్రం చూసి చూడనట్లు కాలం వెళ్లదీస్తూ తాము మాత్రం ఠంచనుగా వేతనాలు పొందుతున్నారు. ఇలా మరోవైపున అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థులకు అందాల్సిన స్థాయిలో భోజన వసతులు, సౌకర్యాలు అందడం లేదు. పలు హాస్టళ్ల అయితే కనీస సౌకర్యాలు లేక సమస్యలకు నిలయంగా మారుతున్నాయని చెప్పవచ్చు. కొన్ని సంక్షేమ హాస్టళ్ల మాత్రం అరకొర వసతుల మధ్యనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నుండి సరిపడా నిధులు అందక భోజన సదుపాయాలను కూడా సరిగ్గా కల్పించలేని దుస్థితి నెలకొంది. పాఠశాల సమయం వరకల్లా విద్యార్థులు రెడీ అయ్యేందుకు కూడా సరైన సదుపాయాలు లేక ఆలస్యం అవుతోంది. కొన్ని హాస్టళ్లలో విద్యార్థులే తోటి విద్యార్థులకు వడ్డిస్తూ అల్పాహారం మధ్యాహ్న భోజనాలను చేసుకుంటున్నారు. హాస్టల్ వార్డెన్లు ఉంటున్నా వారూ విధులకు సరిగ్గా హాజరు కావడం లేదు. దీంతో సంక్షేమ శాఖ హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్థంగా సాగుతోంది. ముస్లిం మైనారిటీ రెసిడెన్సియల్ హాస్టళ్లనే తీసుకుంటే తమ పిల్లలు ఎలా చదువుకుంటున్నారు? వారికి భోజన వసతులు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు వస్తే కేవలం ఆదివారం పూట మాత్రమే రావాలని, ఇతర రోజుల్లో పేరెంట్స్‌కు ఏం పని అని సమాధానం చెబుతున్నారు. వారాంతాలలో వచ్చి తమ బిడ్డల యోగక్షేమాలను తెలుసుకుంటుంటే ఆ చిన్నారులు హాస్టళ్ల దుస్థితిని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. అక్కడే హాస్టల్ వార్డెన్ ఉంటుండడంతో కొందరు చిన్నారులు తమ తల్లిదండ్రులకు నిజాలను కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంటోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలలో పలు హాస్టళ్లకు సరిపడా భవనాలు లేక ఇరుకు గదుల్లోనే విద్యను అభ్యసిస్తున్నారు. కరోనా నేపథ్యంలో గత రెండేళ్లుగా మూత పడిన ఎస్‌సి ఎస్‌టి బిసి ముస్లిం మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు ఇటీవలే తెరుచుకున్నాయి. ఈ హాస్టళ్లలో విద్యార్థులకు తాగేందుకు కనీసం మంచినీరు కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. టాయిలెట్లు, మరుగుదొడ్లు మంచినీరు తదితర సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. హాస్టళ్లను మరమ్మతు చేయించాల్సిన అధికార యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యం చూపడంతో కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకుని బూత్ బంగ్లాల మాదిరిగా కనిపిస్తున్నాయి. దీనికి తగినట్టుగా సరైన నిఘా కూడా లేక పోవడం గమనార్హం. కనీసం భోజన సవతులైనా సరిగ్గా ఉన్నాయా అంటే అదీ లేకుండా పోయింది. వారంలో రెండు పర్యాయాలు నాన్ వెజ్ కోడిగుడ్లు వంటివి కరువయ్యాయి. పలు హాస్టళ్లలో సన్నరకం పేరుతో నాసిరకం బియ్యంతోనే భోజనాలు పెడుతున్నారని



ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం సన్నరకం బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొందరు అధికారులు చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారు.

రైస్ మిల్లుల నుండి నాసిరకం బియ్యాన్ని సేకరించి వాటిని విద్యార్థులకు పెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పలు సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం కరువైంది. వారానికి కనీసం ఆరు సార్లయినా కోడిగుడ్లు పెట్టాల్సి ఉండగా ఏదో మొక్కుబడిగా ఓ రెండు మూడు సార్లే పెడుతున్నారని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. నెలకు రెండు సార్లు పెట్టాల్సిన మటన్ స్థానంలోనూ వారంతాలలో ఒక సారి చొప్పున నాలుగు పర్యాయాలు కేవలం చికెన్ మాత్రమే పెడుతున్నారు. ఇడ్లీ పూరి, బొండా వంటి అల్పాహారం ను పెట్టాల్సి ఉండగా కిచిడీ సాంబర్‌తో విద్యార్థుల నోట్లో మట్టి కొడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నీళ్ల చారు నాసిరకం కూరలతోనే కానిచ్చేస్తున్నారు. సన్నబియ్యంతో అన్నం చేసిపెడతామని ప్రభుత్వం ఒక వైపున చెబుతుంటే తమకు ఆ భోజనం అందడమే లేదని ఆ అన్నం కూడా తినలేని పరిస్థితులు ఉంటాయని విద్యార్థులు చెబుతున్నారు. కాగా చాలా చోట్ల అద్దె భవనాలలోనే సంక్షేమ హాస్టళ్లుకొనసాగుతున్నాయి. కొన్ని భవనాలు కొత్తవి అయితే మరి కొన్ని మాత్రం పాత భవనాలలోనే కొనసాగుతున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఇటీవలలో కొన్ని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్దులు తమకు అందిస్తున్న భోజనం బాగా లేదని రోడ్డెక్కేందుకు సిద్ధం కాగా ఉన్నతాధికారుల చొరవతో ఆందోళన విరమించుకున్నారు.

### ట్రాక్టర్, బస్సు ఢీకొని

# పారిశుధ్య కార్మికుడు దుర్మరణం

**న్యాయం చేయాలని కార్పొరేషన్ ఎదుట మృతదేహంతో కార్మికుల ధర్నా**



సంఘటనా స్థలంలో మృతి చెందిన మీర్‌పేట్ పారిశుధ్య కార్మికుడు సదానందం

సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త: డంపింగ్ యార్డులో చెత్తను డంప్ చేసి వెళ్తున్న ట్రాక్టర్‌ను బస్సు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పారిశుధ్య కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా ట్రాక్టర్ నడుపున్న డ్రైవర్ గాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. ఈ సంఘటన నగర శివార్లలోని నాగోల్–ఉప్పల్ రింగ్ రోడ్డులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త సేకరించే ట్రాక్టర్‌పైన విధులు నిర్వహించే జిల్లెలగూడకు చెందిన మీసాల సదానందం, డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డిలు మంగళవారం రోజూ మాదిరిగానే చెత్తను డంప్ చేయడానికి నాగోల్–ఉప్పల్ రింగ్‌రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డుకు వెళ్ళారు. అక్కడ చెత్తను డంప్ చేసి తిరిగి మీర్‌పేట్‌కు బయలుదేరగా అక్కడే మార్గమధ్యలో ప్రైవేటు బస్సు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. దీంతో ట్రాక్టర్‌పై నుండి కింద పడ్డ సదానందం తలకు తీవ్ర గాయం కావడంతో రక్తపు మడుగులోనే అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి సైతం తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు.

**మృతదేహంలో మీర్‌పేట్ కార్పొరేషన్ ఎదుట పారిశుధ్య కార్మికుల ఆందోళన**

తోటి పారిశుధ్య కార్మికుడు మీసాల సదానందం విధి నిర్వహణలో దుర్మరణం పాలైనా అతని కుటుంబానికి నష్టపరిహారం గానీ, ఉద్యోగం గానీ ఇస్తామని ఎవరూ హామీ ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన పారిశుధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఏకంగా అంబులెన్స్‌లో సదానందం శవాన్ని తీసుకొచ్చి కార్పొరేషన్ ముందు టెంటు వేసి ధర్నా చేశారు. మృతదేహాన్ని కిందకు దింపడానికి యత్నించగా మీర్‌పేట్ పోలీసులు అడ్డుకోవడంతో కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కార్మికులకు మద్దతుగా కార్మిక సంఘాల నాయకులు, జిల్లెలగూడ ప్రజాప్రతినిధుల, నాయకులు తరలివచ్చారు. దీంతో మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ మహేందర్‌రెడ్డి బందోబస్తును ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమీషనర్ నాగేశ్వర్‌రావు సంఘటనా స్థలానికి వచ్చి మృతి చెందిన కార్మికుడు సదానందం కుటుంబానికి నష్టపరిహారం, ఉద్యోగం ఇచ్చే విషయమై కౌన్సిల్ మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. అదే విధంగా మేయర్ భర్త దీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్లు అ ౦ ౖ ల భూపాల్‌రెడ్డి, బైగళ్ళ బాలమణి, గజ్జెల రాంచందర్ తదితరులు కూడా కార్మికులను శాంతింపజేయడంతో వారు ధర్నాను విరమించారు.



కార్పొరేషన్ కార్యాలయం ముందు మృతదేహంతో ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు, కుటుంబ సభ్యులు

## కంకర తేలి..

**రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్రవాహనదారులు**

# మట్టి పేరుకుపోయి..

**ప్రధాన రహదారులపైనా భారీ గుంతలు**

**పూర్తిగా పాడైపోయిన వరంగల్ జాతీయ రహదారి**

**ఉప్పల్, బోడుప్పల్, ఫిర్జాదిగూడ,అంబర్‌పేట**

**అంతర్గత రోడ్లు మరీ అధ్వాన్నం**

**మరమ్మతుల పేరుతో రూ.కోట్లలో వ్యయం**

**అయినా మారని దుస్థితి**



సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో..

నగరం బురదమయంగా మారి విశ్వనగరంగా తీర్చిదిద్దే హైదరాబాద్‌లోనే ఉన్నామా? అన్న అనుమానం కలగిస్తోంది. ఐదు నెలల క్రితం నిర్మించిన రహదారులపై కూడా పలు ప్రాంతాల్లో గుంతలు పడి, కంకర తేలాయి. లోయర్ ట్యాంక్‌బండ్‌తో పాటు శివారు ప్రాంత ఫిర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లలో కంకరతేలి మోకాల్లోతున గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని వారాసిగూడ, సీతాఫల్‌మండి, చిలకలగూడ, రాంనగర్, రాజేంద్రనగర్, అలీనగర్, అంబర్‌పేట, రాజేంద్రనగర్, ఉప్పల్ నల్లచెరువు నుండి అంబర్‌పేట వరకు ఏర్పడిన గుంతలను పూర్చడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలత్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నగర శివారు ప్రాంతాలు నిజాంపేట, దుండిగల్, మణికొండ మున్సిపాలిటీల ప్రాంత రహదారుల్లో పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. తాగు నీటి, డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్విన రోడ్లను పునరుద్ధరించలేదు.

హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త : భారీ వర్షాలకు మహానగర రహదారులు ఎప్పటిలాగే ఛిద్రమయ్యాయి. వందల కోట్లు ఖర్చు పెట్టినా పరిస్థితిలో మార్పు కాలేదు. గ్రేటర్‌లో 9,103 కి.మీల రహదారులున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా రోడ్లు గుంతల మయంగా మారడంతో పాటు వరద నీటితో కొట్టుకు వచ్చిన మట్టి మేట వేసింది. ఒక వైపు గుంతలు, మరో వైపు మట్టి, కంకర ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. పట్టుమని పది మీటర్లు కూడా కుదుపులేని ప్రయాణం నగర రోడ్లపై సాగే పరిస్థితి లేదు. ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోన్న ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, లింగంపల్లి ప్రాంతాల్లో రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. ఔటర్ రింగ్‌రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ మార్గంలో వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. కర్మన్‌ఘాట్, చంపాపేట, చాంద్రాయణగుట్టల మీదుగా శంషాబాద్‌కు వెళ్లే వారికీ అదే దురవస్థ, చేరుకోవాల్సిన గమ్య స్థానానికి వెళ్లేందుకు పాడైన రహదారుల వల్ల సమయ బారం పడుతోంది. ఎలివే టెడ్ కారిడార్ పనులు జరుగుతున్న ఉప్పల్, బోడుప్పల్, ఫిర్జాది గూడ మీదుగా వరంగల్ జాతీయ రహదారి పూర్తిగా రోడ్డు పాడైపోయింది. ఇక నల్లచెరువు రోడ్డు పరిస్థితి మరింత అధ్వా న్నంగా తయారైంది.



నాణ్యతా రహిత పనుల వల్లే ఈ పరిస్థితి అన్న అభిప్రాయం వ్యక్తమవు తోంది. జిహెచ్‌ఎంసి అధికార లెక్కల ప్రకారం రహదారుల నిర్మాణం, నిర్వహణ (వంతెనలు, అండర్‌పాస్‌లు కాకుండా)కు కోట్లు కుమ్మరిస్తున్నా మహానగరంలో రహదారుల పరిస్థితి మెరుగుపడడంలేదు. లాక్‌డౌన్ సమయంలో రూ.250 కోట్ల వ్యయంతో నిర్మించిన అద్దంలా మెరిసినరోడ్లు ఇటీవల కురిసిన వర్షాల దెబ్బకు వెలవెల బోతున్నాయి. ప్రైవేటుకు అప్పగించిన రోడ్ల నిర్వహణలోనూ నాణ్యత కొరవడింది.

వర్షాలు వస్తున్నాయంటే నీరు నిలిచి రోడ్లు పాడవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో కొంత వాస్తవం ఉన్నా.. శాస్త్రీయ విధానంలో రోడ్డు నిర్మించక పోవడమే వరద నీరు నిలిచేందుకు ప్రధాన కారణమని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రమాణాల ప్రకారం రోడ్డు మధ్యలో ఎత్తుగా ఉండి, పక్కలకు ఏటవాలుగా ఉండాలి. కానీ కార్పెటింగ్, రీ కార్పెటింగ్ ప్యాచ్ వర్క్‌ల పేరిట ఇష్టానికి బీటీ మిక్సింగ్ వేయడంతో చాలా ప్రాంతాల్లో ఎగుడు దిగుడుగా రమదారులు కనిపిస్తాయి. దీంతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు ఉన్న వాటిలోకి వర్షపు నీరు వెళ్లే పరిస్థితి చాలా ప్రాంతాల్లో లేదు. రోడ్ ప్రొఫైల్ సరిగా లేకపోవడమూ రోడ్డు పాడవడానికి కారణమన్నది నిపుణుల అభిప్రాయం.



**నాగదేవతకు భక్తుల పూజలు**

నాగులపంచమి సందర్భంగా బొల్లారంలోని నాగదేవత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

# నిర్లక్ష్యపు నీడలో గుడిమల్కాపూర్ మార్కెట్

**పనిచేయని సీసీ కెమెరాలు**

**గతంలో మంజూరైన రూ. 10 లక్షలు నిరుపయోగం**

**కొత్తగా మరో రూ.15 లక్షల నిధులు మంజూరు**

**మందుబాబులకు అడ్డాగా మారిన వైనం**

**వ్యాపారులు, కొనుగోలుదారులకు**

**శాపంగా అధికారుల అలసత్వం**



గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్, (ఇన్‌సెట్‌లో) మార్కెట్ కార్యాలయంలో నిరుపయోగకరంగా ఎల్‌ఈడీలు

మెహిదీపట్నం, ఆగస్టు 2, ప్రభాతవార్త : గుడిమల్కాపూర్ మార్కెట్ నిర్లక్ష్యపు నీడలో కొనసాగుతుంది. మార్కెట్‌కు వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు భద్రతగా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నిత్యం మార్కెట్‌లో ఎదో ఒక సంఘటనలు చోటు చేసుకోవడంతో పాటు సెల్‌ఫోన్‌లు, నగదు పోవడం పరిపాటిగా మారుతున్నాయి. గతంలో మార్కెట్‌లో మాయమవుతున్న సెల్‌ఫోన్‌లు, నగదు విషయాలపై వ్యాపారులు, కొనుగోలుదారులు మార్కెట్ అధికారులకు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఫిర్యా దులు చేయడమే మానేశారు. గుడిమల్కాపూర్ హోల్‌సేల్ మార్కె ట్, పూలమార్కెట్, రిటైల్ మార్కెట్‌లలో భద్రత లేకపోవడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం.. వ్యాపారులకు, కొనుగోలుదారులకు శాపంగా మారింది. స్థానిక పోలీసుల అవగాహనతో తమతమ షాపుల ముందు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు తప్ప యార్డులో మాత్రం ఒక్క సీసీ కెమెరా పని చేయడం లేదు. నిత్యం వేలాది మంది వ్యాపారులు, కొనుగోలుదారులతో రద్దీగా ఉండే మార్కెట్‌లో కనీసం పదుల సంఖ్యలో సీసీ కెమెరాలు పనిచేయక పోవడం గమనార్హం.

**నిరుపయోగకరంగా మారిన సీసీ కెమెరాలు..** గుడిమల్కాపూర్ హోల్‌సేల్ మార్కెట్, పూల మార్కెట్‌తో పాటు రిటైల్ మార్కెట్‌లో అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. యార్డుల్లో రక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకే రక్షణ లేకుండా పోయింది. కొన్ని కెమెరాలు నిరుపయోగకరంగా మారి అక్కడక్కడ వేలాడుతుండగా మరికొన్ని కెమెరాలను దొంగలు అపహరించుకు పోయారు. మార్కెట్‌లో వ్యాపారుల, కొనుగోలుదారుల భద్రత కోసం 2018-19వ సంవత్సరంలో మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు రూ. 10 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో రూ. 3 లక్షల 91 వేల 309లను వెచ్చించి కెమెరాలను ఏర్పాటు చేయగా పూలమార్కెట్‌తో పాటు రిటైల్ మార్కెట్‌లో రూ. 5 లక్షల 98 వేల 484 లను వెచ్చించి సీసీ కెమెరాలతో పాటు మార్కెట్ కార్యాలయంలో ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. అవి నేడు పూర్తిగా నిరుపయోగకరంగా మారి దర్శనమిస్తున్నాయి.

**మందుబాబులకు అడ్డాగా మార్కెట్..**

గుడిమల్కాపూర్ మార్కెట్ మందుబాబులకు అడ్డాగా మారింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకే మార్కెట్‌లో వ్యాపారాలు కొనాసాగుతుండడం ఆపై వ్యాపారులు వెల్లిపోతుండడం మందుబాబులకు అనువుగా మారింది. కొద్దిగా చీకటి పడిందంటే చాలు మందుబాబులు వ్యాపార సము దాయాల ముందే మద్యం సేవిస్తూ గొడవలకు దిగుతున్నారు. రాత్రి సమయంలో సెక్యూరిటీ గార్డులు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. పూలమార్కెట్‌కు గేటు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా మార్కెట్ అధికారులు చొరవతీసుకొని మార్కెట్ యార్డుల్లో సీసీ కెమెరాలతో పాటు పూలమార్కెట్‌కు గేటును ఏర్పాటు చేయాలని వ్యాపారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

**సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 15 లక్షల నిధులు మంజూరైనాయి : గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ ఎన్.అపర్ణ**

మార్కెట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ. 15 లక్షల నిధులు మంజూరైనాయి. హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, పూలమార్కెట్‌తో పాటు రిటైల్ మార్కెట్‌లలో త్వరలోనే కెమెరాలను ఏర్పాటు చేస్తాం. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఉపయోగంలోకి తీసుకురావడంతో పాటు కొత్త వాటిని ఏర్పాటు చేస్తాం.

# దళిత బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
## - ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్ దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతిష్టాత్మకంగా దళిత బంధు పథకాన్ని తీసుకువచ్చారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఈ పథకంతో దళిత కుటుంబాలు ఉన్నత స్థాయికి ఎదుగుతాయని చెప్పారు. దళిత బంధు పథకం ద్వారా నల్లకుంట డివిజన్ లింగంపల్లికి చెందిన శేఖర్‌కు మంజూరైన కారును మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. దళిత బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకుని దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే సూచించారు.


లబ్ధిదారునికి కారును ఇస్తున్న కాలేరు వెంకటేష్

# రాష్ట్ర గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

**సికింద్రాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా కైరంకొండ యాదగిరి, అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది దేశబోయిన రఘు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ సందిరి రవీందర్, గాండ్ల శ్రీనివాస్, పాక రాజేశ్వర్‌ప్రసాద్, ప్రధానకార్యదర్శిగా గడ్డం సాయికిరణ్, సహాయకార్యదర్శిగా పాతకాల రాజేంద్రప్రసాద్, కంటి సతీష్, టంగుటూరి దయానంద్, కోశాధికారిగా అక్కపల్లి ఉదయ్‌కిరణ్, ప్రచారకార్యాదర్శిగా నాగుల ప్రకాష్, పూసరాజు, సలహాదారులుగా కర్మకొండ హనుమంత్‌రావు, పాతకాల సత్యనారాయణ, కొలిపాక రామ్‌చందర్, కార్యవర్గ సభ్యులుగా కె.సంగయ్య, ముద్రగడ వెంకటేశ్వర్లు, అరికంటి లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దేశబోయిన రఘు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గంగపుత్ర సంఘం అభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా,సామాజికంగా గంగపుత్రులు ఎదిగేలా శ్రమిస్తానని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా అధ్యక్షుడిగా సేవలు అందించిన కైరంకొండ యాదగిరిని అభినందించారు.

# భారత ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య
## -మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్

**చిక్కడపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** భారత ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య అని మాజీ ఎంపి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పాశం అనీల్‌యాదవ్ ఆధ్వర్యంలో త్రివర్ణపతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అంజన్‌కుమార్‌యాదవ్ వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రుషికేష్, వి.డి.కృష్ణ, జిఎన్.కేశవ్, గుర్రం శంకర్, మేడి సురేశ్, రఘు, శుల్‌లాల్, పెండెం శ్రీనివాస్‌యాదవ్, జంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇండ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలని అంజన్‌కుమార్ యాదవ్ సూచించారు. పింగళి వెంకయ్య గొప్ప దేశభక్తుడు అని, జాతీయ పతాకం ఎగిరే వరకు స్మరించుకోదగిన ధన్యజీవి పింగళి వెంకయ్య అని, నిరాడంబరమైన, నిస్వార్థమైన జీవితం గడిపిన మహామనిషి అని అన్నారు.


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్

# తెలంగాణ సంస్కృతి పండుగల 'వ్యూ ఫైండర్' చిత్రకళాప్రదర్శన

**రవీంద్రభారతి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో యువ చిత్రకారుడు 'పవన్ ఐ ఫోటోగ్రఫీ' పవన్ బింగి నిర్వహణలో 'వ్యూ ఫైండర్' శీర్షికన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, ప్రకృతిని ప్రస్ఫుటింపజేస్తూ రవీంద్రభారతి కారిడార్ (ఠాగోర్ ప్రాంగణం-ఫోయర్)లో ఏర్పాటు చేసిన సోలో చిత్రకళా ప్రదర్శనను మంగళవారం ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గిడ్డంగులశాఖ ఛైర్మన్ సాయిచంద్ విశిష్ట అతిథి ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణుడు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, పవన్ బింగి తదితర యువ చిత్రకారులతో కలిసి ప్రారంభించారు. పవన్ అతి చిన్నవయస్సులోనే అద్భుత చిత్రాలతో ఏర్పాటు చేసిన ఈ సోలో ఫోటో ప్రదర్శన మన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ యువ తెలంగాణ, యువకులు ఎలా ప్రతిభావంతులు కావాలి, తమ ప్రతిభాపాటవాలను యావత్ లోకానికి చాటిచెప్పాలి అన్న మహోన్నత ఆశయాలకు అద్దంపడుతూ తదనుగుణంగా ఉండడం హర్షదాయకమన్నారు. దైవజ్ఞశర్మ పవన్ భవిష్యత్ ఈ ప్రదర్శనలోని చిత్రాలవలే విరాజిల్లాలని, తెలంగాణ రాష్ట్రమే కాకుండా యావత్ భారతదేశం గరి ఒచదగ్గ గొప్ప కళాకారుడుగా పేర్గాంచాలని శుభాశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత మెర్సీ మార్గరట్, నటుడు దర్శకుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ వ్యూఫైండర్ సోలో ఫోటో ఎగ్జిబిషన్‌లో మొత్తం 66 చిత్రాలను ప్రదర్శనలో ఉంచడం జరిగిందని, ఔత్సాహికులైన ప్రేక్షకుల సందర్శనార్థం 12వ తేదీవరకు ఉదయం 11నుండి రాత్రి 7గంటల వరకు ఉంటుందని, అధికసంఖ్యలో ప్రేక్షకులు విచ్చేసి ఈ ప్రదర్శనను ఆసాంతం తిలకించి ఆస్వాదించి విజయవంతంచేసి ఆశీర్వదించాలని కళాకారుడు, నిర్వాహకుడు పవన్ బింగి కోరారు.


చిత్రాలను నిశితంగా పరిశీలిస్తున్న సాయిచంద్, దైవజ్ఞశర్మ, కళాకారుడు పవన్ తదితరులు

# వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య భర్త అరెస్టు

**గచ్చిబౌలి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** అదనపు కట్నం కోసం వేధించి భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాకు చెందిన ఆర్.రమేష్, అతని భార్య సునిత(23)లు నగరంలోని గచ్చిబౌలి సుదర్శన్‌నగర్ కాలనీ ప్లజెంట్ హోమ్స్ అపార్టుమెంటులో నివాసం ఉండేవారు. రమేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, సునిత గృహిణి. రమేష్, సునితలకు 2019లో వివాహం జరిగింది. వివాహ సమయంలో సునిత కుటుంబ తల్లిదండ్రులు కట్నం కింద 5తులాల బంగారం, 14లక్షల నగదు, 20 సెంట్ల భూమిని ఇచ్చారు. అనంతర కాలంలో కొత్త కారు కొనుగోలు చేసేందుకు మరో 10 లక్షల రూపాయల అదనపు కట్నం తేవాలంటూ భర్తతో పాటు అత్త, మామలు సునితను వేధించసాగారు. ఈ క్రమంలో రమేష్‌కు హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ కావడంతో భార్య,భర్తలు ఇద్దరు నగరంలో కాపురం పెట్టారు. కాగా ఇక్కడి వచ్చిన తరువాత సైతం అదనపు కట్నం కోసం భర్త రమేష్ నుంచి వేదింపులు తప్పకపోవడంతో సునీత జూలై 28వ తేదీన సాయంత్రం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై సునిత కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త రమేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# బొద్దులూరి రామారావు, కెహెచ్ఎస్ జగదాంబకు అభినందన సత్కారం

**చిక్కడపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** కిన్నెర ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గానసభ సభ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పతాక రూపక ర్త పింగళి వెంకయ్య 144వ జయంతి మహోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానభలోని కళాసుబ్బారావు కళావేదికలో పింగళి వెంకయ్య లఘుచిత్ర నిర్మాత బొద్దులూరి రామారావు, పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కెహెచ్ఎస్.జగదాంబకు అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం హాజరై సత్కరించి అభినందించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి, ప్రముఖ రంగస్థల నటులు డాక్టర్ అక్కిరాజు సుందరామకృష్ణ, నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు. బొద్దులూరి రామారావు రూపొందించిన లఘుచిత్ర ప్రదర్శన జరిగింది.


బొద్దులూరి రామారావు, జగదాంబలను సత్కరించిన దృశ్యం

# ప్రజా సంగ్రామ యాత్రకు తరలివెళ్లిన బిజెపి శ్రేణులు

**అడ్డగుట్ట, ఆగస్టు 2, ప్రభాతవార్త :** నిరంకుశ కుటుంబ అవినీతి పాలనపై మంగళవారం ప్రజా సంగ్రామ యాత్రకు తరలివెళ్లిన బిజెపి శ్రేణులు యాదగిరి గుట్టలో బిజెపి తలపెట్టిన ప్రజా సంగ్రామ యాత్రకు కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ,మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక,అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బిజెపి నాయకులు నాగపూరి రాజుగౌడ్, హంసరాజ్, అంబాల మహేశ్, సి.హెచ్.కన్నాభిరామ్, ఆర్.నందు,రాజేశ్వర్ రావ్‌ల ఆధ్వర్యంలో వందలాది మంది తరలివెళ్ళారు.

# ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం
## - కార్పొరేటర్ సామలహేమ

**సికింద్రాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ తెలిపారు. డివిజన్‌లోని మహ్మద్‌గూడలో పర్యటించి స్థానికులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాలా సంవత్సరాల కిందట వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ కారణంగా తరచుగా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. పైప్‌లైన్ మార్చాలని కార్పొరేటర్‌ను కోరారు. వెంటనే స్పందించిన సామలహేమ జలమండలి అధికారులతో అప్పటికప్పుడు మాట్లాడి పైప్‌లైన్ మార్చడం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైతే డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరతానని తెలిపారు. త్వరలోనే డ్రైనేజీ సమస్యలు పరిష్కారం అవుతాయని స్థానికులకు తెలిపారు. ఈ కార్యాక్రమంలో జలమండలి మేనేజర్ నవ్య, టీఆర్ఎస్ నేతలు అజయ్ ఇతర నేతలు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న సామలహేమ

# సామాజిక సేవా, ధార్మిక కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు పాల్గొనాలి
## - పోలీసుహౌజింగ్ కార్పొరేటర్ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త

**చిక్కడపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** సామాజిక సేవా, ధార్మిక కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు తరచు పాల్గొనాలని తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేటర్ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్త పిలుపునిచ్చారు. వామ్ గ్లోబల్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో త్రిభాషా మహాసహస్రావధాని, ప్రణవపీఠా ధిపతి బ్రహ్మ శ్రీ వద్దిపర్తి పద్మాకర్‌చే 'హనుమాన్ మహిమ' అంశంపై ప్రసంగ కార్యక్రమం కోఆర్డినేటర్ కొటికె విఠల్, ఫోరం చైర్మన్ వి.బాబురావు, సెక్రటరీ జనరల్ పివి.రమణయ్య, కోశాధికారి మానేపల్లి రామారావు, ముఖ్యసలహాదారు చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా ఫోరం లోగోను వద్దిప ర్తి పద్మాకర్ ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, కొల్లేటి దామోదర్‌గుప్త తో పాటు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, ఫోరం గ్లోబల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తంగుటూరి రామకృష్ణ, పబ్బతి రవికుమార్, సలహాదారు బంగారు సుబ్బారావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు పబ్బతి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం కోఆర్డినేటర్ కొటికె విఠల్ ఆద్యాంతం అందరిని ఉత్సాహపరుస్తూ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లేటి దామోదర్‌గుప్త మాట్లాడుతూ వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనాలు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. అనంతరం వద్దిపర్తి పద్మాకర్ 'హనమాన్ మహిమ'పై రెండు గంటల పాటు చక్కగా ప్రసంగించారు. ఆత్మహత్యల పట్ల సమస్యలు పరిష్కారం కావనీ, బతికి ఉన్నవారిని మరిన్ని సమస్యలె వెంటాడుతాయని, ఇది హనుమంతులవారి జీవితంలో ఉన్న సందేశం అని అన్నారు. జీవితమంతా కష్టపడినా సమస్యలు కలకాలం ఉండవని, జీవితంలో సుఖాలు ఏదో సమయంలో వస్తాయని వివరించారు.


పాల్గొన్న బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, కొల్లేటి దామోదర్‌గుప్త

# ఘనంగా పలహార బండ్ల ఊరేగింపు

**అడ్డగుట్ట, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని, ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్ తెలిపారు. అడ్డగుట్ట, ఆజాద్ చంద్రశేఖర్ నగర్, వడ్డెర బస్తీల్లో నిర్వ హించిన పలహార బండ్ల ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆర్గనైజర్లు దండుగుల వెంకటస్వామి, డి.మోహన్‌ల ఆధ్వర్యంలో పలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్, టిఆర్ఎస్ యువనాయకులు రామేశ్వర్ గౌడ్, కిషోర్ గౌడ్, గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు వెంకటస్వామి, మోహన్‌లు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.


పూజలో పాల్గొన్న పద్మారావు గౌడ్ తదితరులు

**కంటోన్మెంట్ :** కంటోన్మెంట్ నియోజకవర్గం ఈస్ట్ మారేడ్‌పల్లి వడ్డెర బస్తీలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రేణక ఎల్లమ్మ దేవాలయం నిర్వాహకులు దండుగుల వెం కటస్వామి, బి.మోహన్‌ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన పలహారం బండి ఊరేగింపులో ఆయన ముఖ్య అతిధిగా హాజరై రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దండుగుల యాదగిరి పాల్గొన్నారు.


పలహారం బండి ఊరేగింపు రథాన్ని ప్రారంభిస్తున్న జంపనప్రతాప్

# వాల్మీకి నగర్‌లో ఘనంగా మహారాజ్ పూజలు

**కంటోన్మెంట్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** కంటోన్మెంట్ 5వ వార్డు వాల్మీకి నగర్‌లో ఏర్పాటు చేసిన గోగ మహారాజ్ పూజా,చడి స్థాపన మహోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ షర్వీన్, టిఆర్ఎస్ నాయకులు సదానంద్ గౌడ్, కిరణ్, పెంట శ్రీహరి, తేజ్‌పాల్, అజయ్, నిత్యానంద్, కాంగ్రెస్ నేత హరి తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న టీ.ఎన్ శ్రీనివాస్ తదితరులు


సంగ్రామ యాత్రకు తరలిన డి.విఘ్నేశ్వర్, మల్లేష్‌యాదవ్, శ్యామ్‌రావు, కృష్ణారెడ్డి, రాముగౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, నర్సింహా, చారి

# నాగులపంచమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న సామల హేమ


పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్


రామారావునగర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**సికింద్రాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** నాగుల పంచమి సందర్భంగా సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, బన్సీలాల్‌పేట్‌లలో ఆలయాలలో భక్తులు ప్రత్యేకపూజలు జరిపారు. నామాలగుండు, మార్కండేయనగర్‌లలో ఉన్న పాములపుట్టలో మహిళా భక్తులు ఎంతోభక్తిశ్రద్ధలతో పాలుపోయి పూజలు జరిపారు. ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటు సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామలహేమ క్లాక్‌టవర్ వద్ద ఉన్న మానసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

**కంటోన్మెంట్ :** నాగులు పంచమిని పురస్క రించుకొని మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ లోని క్లాక్‌టవర్, మారేడ్‌పల్లి న్యూ క్లబ్, బోయిన్‌పల్లి, చింతల్ బస్తీ, తిరుమలగిరిలోని పరిసర ప్రాంతాల్లో నాగదేవత దేవాలయాల్లోని పలు దేవాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**చిక్కడపల్లి :** నాగుల పంచమి సందర్భంగా చిక్కడపల్లి, వివేక్‌నగర్ పరిధిలోనీ పీపుల్స్ పార్కులో నాగదేవత ఆలయంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ఎ.వినయ్‌కుమార్, పి. నర్సింగరావు, లావణ్య, రఘుయాదవ్, ఆలయం పూజారి శ్రీనివాస్, స్థానికులు శివకుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**యూసుఫ్‌గూడ :** రామారావునగర్‌లోని నాగదేవత దేవాలయంలో నాగుల పంచమి సందర్భంగా ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి మహిళలు నాగదేవత పూజలకోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు నాగుల సత్యం, కమిటి సభ్యులు సంజీవ, శివయ్య, సాంబశివ, బిక్షపతి, రఘుపతి, సుభాష్‌రెడ్డి, నరిసనంహ, కృష్ణయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా గోదారంగమన్నార్‌స్వామి రథోత్సవం
## - పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, భక్తులు

**ఘట్‌కేసర్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో మంగళవారం రాత్రి గోదారంగమన్నార్‌నాయకస్వామి రథో త్సవం వైభవంగా జరిగింది. హైదరా బాద్ నగరానికి సమీపంలోని ఎదులా బాద్‌లో అండాల్‌మన్నార్ స్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా ప్రతియేటా శ్రావణమాసంలో నాగులపంచమి రోజున స్వామి జాతర, రథోత్సవం నిర్వహించ డం ఆనవాయితీగా వస్తోంది. పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి ఆలయంలో అండాల్ అమ్మవా రిని, రంగనాయకస్వామిలను దర్శించు కొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా పూలు, విద్యుత్ లైట్లతో అలంకరించిన స్వామి రథానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. భక్తుల గోవిందనామ స్మరణ, కేరళ సాంప్రదాయ వాయిద్యాల శబ్దాలు, మిరుమిట్లుగొలుపే లైట్లు, కళాకారుల నృత్యాలతో రథోత్సవం వేడుకగా కొనసాగింది. ఆలయ శంశపారంపర్య ధర్మకర్తలు మంత్రితో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులను శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆయా జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్ర మంలో మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎదులాబాద్‌లో రంగనాయకస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, రథం ఊరేగింపును ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

# 6న శామీర్‌పేట ఎంపిడిఓ కార్యాలయంలో జాబ్ మేళా

**శామీర్‌పేట, ఆగస్టు 2, ప్రభాతవార్త :** ఈ నెల 6వ తేదీన శామీర్‌పేట ఎంపిడిఓ కార్యాలయంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించటానికి జాబ్ మేళా కార్యక్రమం ఉంటుందని ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని శామీర్‌పేట ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, ఎంపిడిఓ జి.వాణి లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఆర్‌డిఓ ఆధ్వర్యంలో శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయం వద్ద జాబ్ మేళా జరుగుతున్నందున నిరుద్యోగ యువతీ,యువకులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 91వీఆర్ఓలకు నియామకాలు
## ఉత్తర్వులు జారీ చేసిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో పనిచేస్తున్న 91మంది విఆర్ఓలకు జిల్లాలోని వివిధ శాఖల్లో వివిధ పోస్టుల్లో వారిని నియమిస్తూ (పోస్టింగ్స్) మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. విఆర్ఓలకు వివిధ శాఖల్లో నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జిఓ ఇటీవలనే జారీ చేయటం జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు అందటం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో వివిధ శాఖల్లో వివిధ పోస్టులలో జిల్లాకు చెందిన విఆర్ఓలను నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్ఓ) వ్యవస్థను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే గత 22నెలల కిందట విఆర్ఓల పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన సంగతి విధితమే. అయితే గత 22నెలల నుంచి కూడ ప్రభుత్వం వారికి వేతనాలు ఇస్తూ ఎలాంటి పోస్టుల్లో వారు లేకుండ వెయిటింగ్‌లో మండల తహసీల్దార్ల కార్యాలయంలో ఉంచి ఇతర పనులకు వినియోగించుకోవటం జరిగింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని 15మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో (విఆర్ఓలు) వారికి ఎలాంటి పోస్టులు లేకుండా ఇప్పటి వరకు విధులు నిర్వహించటం జరిగింది. పభుత్వం ఎట్టకేలకు విఆర్ఓలకు వివిధ శాఖల్లో వివిధ పోస్టులలో భర్తీ చేయటానికి శ్రీకారం చుట్టటం జరిగింది.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నిజాంపేట్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** చెట్ల కొమ్మల తొలగింపుకై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లయన్స్ డివిజన్‌లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఒ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగాఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు న్యూ విజేత, సాయినగర్ రోడ్, వాసవి లే అవుట్, జగన్ స్టూడియో, ప్రశాంతి హిల్స్, శ్రీలక్ష్మీ లే అవుట్ ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది. సాయి కీర్తి లే అవుట్, మౌర్య హోటల్ వెనుక భాగం, ఆర్జీకే రోడ్, బుల్లుట్ షోరూం ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుంచి 12:30 వరకు అంతరాయం ఏర్పడుతుంది. ప్రగతినగర్ 11కేవీ ఫీడర్ల ప్రాంతాలైన ఏనుగుల బొమ్మ చౌరస్తా, ప్రగతి విద్యాలయం, అపురూప కాలనీ, డాలర్ హిల్స్, శ్రీకృష్ణ గార్డెన్, ఎన్టీఆర్ పార్కు, మూడు కోతుల బొమ్మ చౌరస్తా తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.

# సూరారం ప్రైమరీ హెల్త్ కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ

**జీడిమెట్ల, ఆగస్టు 2, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం డీఎంహెచ్ఓ సందర్శించి కోవిడ్ వాక్సినేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెల్త్ సెంటర్ కేంద్రంలో పని చేస్తున్న వారి హాజరు పట్టికను, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, పరికరాల స్టాక్ వివరాలు, ఇమ్యూనైజేషన్ పట్టికలను పరిశీలించారు. అదే విధంగా ఫార్మసీ, స్టోర్ రూములను కూడా క్షుణ్ణం గా పరిశీలించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం సూరారం కాలనీలోని రాజీవ్‌గృహకల్పలో ఇంటింటి సర్వే నిర్వహించి డెంగ్యూ పాజిటివ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓపెన్ 10, ఇంటర్ కోర్సులపై అవగాహన కార్యక్రమం

**చిక్కడపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** ఆర్థికంగా వెనుకబడి పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించలేని, చదువును మధ్యలో ఆపివేసి వివిధ పనులు చేస్తున్నటువంటి వారి కోసం ప్రభుత్వం చేపట్టిన 'అందరికి విద్య'పై ఉచిత అవగాహన కార క్రమాన్ని బిఆర్.ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 7న వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలోని సంస్థలో నిర్వహించబోతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సుదర్శన్ వివరించారు. ఇతర వివరాలకు 9550769991 ద్వారా సంప్రదించవచ్చని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు ఈ కార్యక్రమం ఉంటుందని, అందరికి విద్య కార్యక్రమంలో ఓపెన్ విధానంలో 10వ తరగతి, ఇంటర్‌లు ప్రారంభించడం జరిగిందని, ఆయా కోర్సుల్లో ప్రవేశం కోసం ప్రవేశ విధానం, వయస్సు, విద్యార్హతలు తదితర విషయాలను ఈ అవగాహన కార్యక్రమంలో తెలపడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఆంజనేయస్వామి దేవాలయంలో రాములవారి దివ్య పాదుకలు

**చిక్కడపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** శ్రీరామ జన్మభూమి అయోధ్యలో కొనసాగుతున్న భవ్య రామమందిరం నిర్మాణంలో భాగంగా రాములవారి దివ్య పాదుకలను మంగళవారం వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తుల దర్శనార్థం ప్రతిష్టించారు. ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ భార్య కోవ ఉమా లక్ష్మణ్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మురళీప్రసాద్, ఇవో మాచర్ల దేవనాథం, బిజెపి నగర నాయకుడు ఎ.వినయ్‌కుమా ర్, పి.నర్సింగరావు, నవీన్‌కుమార్, రాజేందర్, ఆకుల అభిషేక్, దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



**PUBLIC NOTICE**

The general public are hereby informed that my Client Sri R. Laxman S/o Takriya has entered an agreement of sale with Sri GUDISHA ANAND PAUL S/o SUNDER SINGH, H.No 6-1-172, V.D.O.S Colony, Khanapuram Haveli, Khammam (Urban), for purchase of plot no 182, admeasuring 200 Sq.Yds or 167.23Sq. mertes in Survey no 221, Situated at ABDULLAPURMET Village and Mandal R.R District and bounded by : North - plot no 181, south - plot no 183; East - 25' wide Road, west - Plot no 173. if anybody has got any claim or objection to said transaction may contact under signed within a week or else my client will complete the Registration process and thereafter no objections will be entertained. Hence, this caution notice to all concerned.

G. Kantharao
Advocate
Plot.no.15,
Yadadrinagar, Munuganoor,
R.R.Dist
(M) 9642321425

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

**కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి**



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, ఆగష్టు 2 ప్రభాతవార్త : విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి అన్నారు. మంగళవారం సూరారం కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన సమయంలో కార్పొరేటర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు భోజనం వడ్డించిన అనంతరం నాణ్యమైన భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలన్నారు. ఆహార విషయంలో నాణ్యత పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన ప్రభుత్వం మధ్యాహ్న పథకాన్ని ప్రవేశపెట్టిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, ప్రధానోపాధ్యాయులు జావేద్, శివగౌడ్, నరేందర్ రెడ్డి, విజయ్, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటుతో టీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పండి



ప్రజా సంగ్రామ యాత్రలో పాల్గొనేందుకు వెళ్తున్న దళిత నాయకులు

నిజాంపేట్, ఆగష్టు 2 ప్రభాతవార్త : రాబోయే ఎన్నికలలో టీఆర్ఎస్ పార్టీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని మంగళవారం దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు దాసి నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా దాసి నాగరాజు మాట్లాడుతూ ప్రజా సంగ్రామ యాత్రలో వేలాదిగా ప్రజలు తరలివచ్చి స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపి రథసారధి, ఎంపీ బండి సంజయ్ తన ప్రాణాన్ని పణంగాపెట్టి వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి అధికార పార్టీతో పోరాడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకూ నెరవేర్చలేదని, తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ రాజకీయపబ్బం గడుపుకుంటున్న టీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలందరూ ఓటుతో బుద్ధిచెప్పాలన్నారు.

## మల్లంపేట్‌లో విద్యుత్ నిలిపివేత

నిజాంపేట్, ఆగష్టు 2 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లంపేట్‌లో 11కేవి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా బుధవారం విద్యుత్ నిలిపివేయబడుతుందని ఏఈ ఒ ప్రకటనలో తెలిపారు. మల్లంపేట్‌లోని కెఆర్‌సీఆర్ కాలనీ రోడ్డు నెంబర్ 1నుంచి 6, ప్రణీత్ ప్రణవ్ అపార్ట్‌మెంట్ పరిధిలో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని, కావున ప్రజలందరు సహకరించాలని ఏఈ కోరారు.

## డ్రైనేజి మరమ్మతుల పనులు వేగవంతంగా పూర్తి చేయండి



డ్రైనేజి పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ రంగారావు

వివేకానందనగర్‌కాలనీ, ఆగష్టు 2, ప్రభాతవార్త : వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్ 35బ్లాక్‌లో బస్తీ దవాఖానా దగ్గర ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవిల ఆదేశాల మేరకు జరుగుతున్న డ్రైనేజి మరమ్మత్తు పనులను కాలనీ వాసులతో కలసి మంగళవారం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజి మరమ్మత్తు పనులు పైప్‌లైన్ లెవెల్స్ కరెక్ట్‌గా చూసుకొని వేయాలన్నారు. మెయిన్ వాల్స్ కట్టిన తర్వాత లోపల బయట ప్లాస్టింగ్ కరెక్ట్‌గా చేయాలని కాంట్రాక్టర్‌కి తెలియజేశారు. డ్రైనేజి మరమ్మత్తు పనులను నాణ్యత పాటిస్తూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సూపర్వైజర్ నాగరాజు, డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, బాబు ఎర్ర లక్ష్మయ్య, శివ, జగదీష‌గౌడ్, రేణుక, చంద్రమోహన్ సాగర్, విద్యసాగర్, సంపత్, వీరయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్‌దారుడిపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం

**తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ లైసెన్సీ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్‌గౌడ్**

హైదరాబాద్, ఆగష్టు 2, ప్రభాతవార్త: వరంగల్ జిల్లాల్లో బార్ లైసెన్సీ యాజమాన్యులను, వైన్‌షాప్ యజమానులకు సమావేశం అని పిలిచి స్టేజిపైనే ఎక్సైజ్‌ఉన్నతాధికారుల ముందు పోలీసులు కొట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ లైసెన్సీ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డిలు ఖండించారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ సోమవారం వరంగల్ కమిషనర్ కార్యాలయంలో బార్‌అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారని ఉదయం 10 గంటల రాత్రి పది గంటల వరకే తెరిచి ఉంచాలని సిసిచెప్పగా ముగ్గురు లైసెన్సీదారులు క్లీనింగ్, సరుకులు సర్దుకోవడం వంటి వాటి కోసం ముందే తీస్తే కేసులు పెడతారా అని ప్రశ్నించినందుకు అక్కడే ఉన్న ఏసిపి, ఇద్దరు సిఐలు చేయిచేసుకున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు .ఇప్పటకే తీవ్ర నష్టాల్లో ఉన్న వ్యాపారులు తమ ఆవేదనను అధికారుల ముందుచెప్పుకుంటే దాడులు చేయడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం చెప్పిన సమయానికి నడుపుతున్న తమపై దాడులు చేయడం కాదని ..బార్లు ,వైన్స్‌ల పక్కనే 24గంటలపాటు మద్యం అమ్మకాలు చేస్తున్న బెల్టుషాపులపై అధికారులు తమ ప్రతాపం చూపించాలన్నారు.

## న్యాయవాదులపై దాడులను అరికట్టాలి : బార్ అసోసియేషన్



న్యాయవాధుల దాడులకు నిరసనగా సికింద్రాబాద్ కోర్టు ముందు ధర్నా చేస్తున్న న్యాయవాదులు

కంటోన్మెంట్, ఆగస్టు, 2 ప్రభాతవార్త: భూ వివాదంలో ములుగు న్యాయవాధి మల్లారెడ్డిని దారుణంగా హత్య చేయడం సరైంది కాదని, న్యాయవాధులకే రక్షణ లేదని సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ చారి, ప్రధాన కార్యదర్శి మంద మురళీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 1న ములుగు జిల్లాల్లో న్యాయవాది మల్లారెడ్డిపై దాడి చేసి విచక్షన రహితంగా కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో న్యాయవాధులు విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు ప్రాంగణంలో న్యాయవాధుల దాడులకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాధిగా పనిచేస్తున్న మల్లారెడ్డిపై ఈనెల 1న సాయంత్రం కారులో హన్మకొండకు వెళ్తుండగా భూపాల నగర్ బస్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు మల్లారెడ్డిని కారును ఢీకొట్టి ఐదుగురు వ్యక్తులు ఆయనపై కత్తులతో దాడి చేసి హత్య చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియయేషన్ ప్రతినిధులు విజయలక్ష్మి, బాల్ నాయక్, గణేష్, ప్రవీణ్, తిరుపతి, మోహన్, ప్రముఖ న్యాయవాధి ఇమ్రాన్ పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రతతో విషజ్వరాలను అరికట్టవచ్చు

**ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్**



అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

వివేకానందనగర్‌కాలనీ, ఆగష్టు 2, ప్రభాతవార్త : గత కొంతకాలంగా కురుస్తున్న వర్షాల వల్ల పలు చోట్ల నీరు నిల్వ ఉండడంతో వైరల్ ఫీవర్ డెంగ్యూ జ్వరాలు ప్రబలి దోమల తయారీకి అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం దోమల నివారణ పట్ల ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జిహెచ్‌ఎంసి ఎంటమాలజీ సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని శివమ్మ కాలనీ, జన్మభూమికాలనీలలో ప్లకార్డులు పట్టుకుని పాదయాత్ర చేశారు. ఇంటింటికి వెళ్ళి డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిలో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటి వల్ల దోమల ప్రబలించి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. ఒక మహిళా తమ పిల్లలని అంగన్వాడీ కేంద్రంలో చేర్చుకోవడంలేదని కార్పొరేటర్ దృష్టికి తీసుకుచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, నరసింహులు, సిద్దయ్యయ, జగదీష్, వెంకటేష్, యాదగిరి, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## పడుపువృత్తి మానేస్తే ఉద్యోగం కల్పిస్తాం

**బ్రాహ్మణ సంక్షేమ భవన్ అధ్యక్షుడు గిరిప్రసాద్ శర్మ**

అంబర్‌పేట్, ఆగష్టు 2 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణ లేక, చదువు లేక, ఆకలిని తట్టుకోలేక, వేరే దారి లేక అనేక మంది మహిళలు మనసు చంపుకుని పడుపువృత్తిలో కొనసాగుతున్నారని బ్రాహ్మణ సంక్షేమ భవన్ అధ్యక్షుడు గిరిప్రసాద్ శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బు కోసం ఒళ్లు అమ్ముకుంటూ జీవితాలను ఆగం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా మహిళలు ముందుకు వచ్చి తనకు పడుపువృత్తి ఇష్టం లేదని ధైర్యంగా చెబితే వారిని బ్రాహ్మణ సంక్షేమ భవన్ తప్పకుండా ఆదుకుంటుందని ఆయన పేర్కొన్నారు. వారికి ఖచ్చితంగా ఉద్యోగం, భద్రత కల్పిస్తామని, మంచి భవిష్యత్తు చూపిస్తామని తెలిపారు. పడుపువృత్తి వల్ల పరువు పోవడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తి జీవితాలు నాశనం అవుతాయన్నారు. కాబట్టి దారి మార్చుకుని ముందుకురావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని సాగించాలని సూచించారు. బ్రాహ్మణ సంక్షేమ భవన్‌లో ప్రతి శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

## జంట జలాశయాలకు స్వల్పంగా పెరిగిన వరద ఉధృతి

**గండిపేట్-6, హిమాయత్ సాగర్-4 గేట్లు ఎత్తిన అధికారులు**

నార్సింగి, ఆగష్టు 2 ప్రభాతవార్త : రాజధాని హైదరాబాద్ మహా నగరం శివారుల్లో ఉన్న జంట జలాశయాలు గండిపేట్, హిమాయత్ సాగర్‌లకు స్వల్పంగా వరద ఉధృతి పెరిగింది. మంగళవారం కురిసిన వర్షాల కారణంగా శంకర్‌పల్లి, మొయినాబాద్ ప్రాంతాలలో ఉన్న వాగులు ఉధృతంగా పారడంతో ఆ నీరంతా జంట జలాశయాలలోకి వచ్చి చేరింది. ఇంకా జంట జలాశయాలు పూర్తి స్థాయిలో నిండలేదు. కానీ జల మండలి అధికారులు ముందు జాగ్రత్తగా రెండు జలాశయాల గేట్లు ఎత్తి మూసీలోకి వరద నీటిని వదిలి పెడుతున్నారు. మూసీనది పరివాహక ప్రాంతాలైన గండిపేట్, మంచిరేవుల, లంగర్‌హౌస్, కిస్మత్‌పూర్, బండ్లగూడ, జియాగూడ, పురాణాపూల్, బహూదర్‌పురా ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేసిన తరువాతనే వరద నీటిని మూసీలోకి వదిలి పెట్టామని జల మండలి అధికారులు పేర్కొంటున్నారు. అకాల వర్షాలతో పెద్ద ఎత్తున వరద నీరు జంట జలాశయాలలోకి చేరితే ఒక్కసారిగా ఆ నీటిని దిగువకు వదులాల్సి వస్తుందని, అప్పుడు పెద్ద ఎత్తున ఆస్థి, ప్రాణ నష్టం జరుగుతుందన్న ఉద్దేశంతో ముందుగానే పైనుంచి వచ్చిన వరద నీటిని వచ్చినట్లే దిగువకు మూసీలోకి వదిలి పెడుతున్నట్లు తెలిపారు. గండిపేట్ జలాశయంలోకి 2,200క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండగా దిగువకు 2,328క్యూసెక్కుల నీటిని 6.గేట్లు 4.ఫీట్ల మేర ఎత్తి మూసీలోకి వదులుతున్నారు. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1790.అడుగులు(3.90టిఎంసిల) కాగా ప్రస్తుతం 1786.40 అడుగులు (3.093టిఎంసిల) నీరుంది. అలాగే హిమాయత్ సాగర్ జలాశయంలోకి 2,500క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా 2,532.క్యూసెక్కుల నీటిని 4.గేట్లు 2.ఫీట్ల మేర ఎత్తి ఈసీ నదిలోకి వదిలి పెట్టారు. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50అడుగులు (2.970.టిఎంసిలు) కాగా ప్రస్తుతం 1761.30అడుగుల నీరు(2.4888టిఎంసిల) నీరుంది. జంట జలాశయాల వద్ద 24.గంటలు అప్రమత్తంగా ఉంటున్నామని, వరద నీరు పెరిగితే వెంటనే గేట్లుఎత్తి దిగువకు వదిలి పెడుతున్నామని జలమండలి జీఎం రామకృష్ణ 'ప్రభాతవార్త'కు వివరించారు.

## ఎరుకల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**అధ్యక్షులు పొన్నకల్ ఎలుసరి కృష్ణయ్య**



నియామకపు పత్రాన్ని అందజేస్తున్న అధ్యక్షులు పొన్నకల్ ఎలుసరి కృష్ణయ్య

తార్నాక, ఆగస్టు 2 ప్రభాతవార్త: ఎరుకల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా కృషిచేస్తానని తెలంగాణ ఎరులక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పొన్నకల్ ఎలుసరి కృష్ణయ్య ఏకల్వ పేర్కొన్నారు. ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య నాయకుల అభిప్రాయం మేరకు రాష్ట్ర కమిటీలలో మార్పులు తీసుకున్నట్లు కృష్ణయ్య పేర్కొన్నారు. లింగాల నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన బళ్లారి నాగేశ్వర్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, కోషాదికారిగా కుతాటీ రాములు,నల్లగొండ భగవాన్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా,రాష్ట్ర కార్యదర్శిగా నల్లగొండ కృష్ణ, సలహాదారులుగా వెలుగు వెంకటేశ్వర్లు, నర్సింగ్‌రావు, కొండ్రెడ్డిఉపేందర్ లను నియమిస్తూ వారికి నియామకపు పత్రాలను అందజేసినట్లు అధ్యక్షులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎలుసరి కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు విద్యా,ఉద్యోగ ఉపాది అవకాశాల కోసం రాజకీయ చైతన్యం కోసం హక్కుల పరిరక్షణ కోసం కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఎరుకల సామాజిక వర్గానికి గుర్తింపు తీసుకురావడానికి తమ వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బండి రవికుమార్, లసహాదారులు బండి నారాయణ, బండి గంగప్ప, లిసుమార్థు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ముందుంటుంది



సబ్దార్ నగర్‌లో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్

యూసుఫ్‌గూడ, ఆగష్టు 2, ప్రభాతవార్త : ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం సబ్దార్‌నగర్ కొత్తూరు సీతయ్యనగర్ పద్మావతినగర్ బస్తీలలో రూ. 2కోట్ల 20లక్షలతో వ్యయంతో సిసిరోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికపుడు పాదయాత్రలు నిర్వహించి సమస్యలు గుర్తించడం జరిగిందన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అవసరమయ్యే విధంగా నిదులు కేటాయించి శాశ్వత పరిష్కారం గా పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో ప్రాంత ప్రజలు అనేక సమస్యలతో సతమతమయ్యేవారని తెలంగాణ అధికారంలోకి వచ్చాక సమస్యలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తామెప్పుడు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, కోఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధాన కార్య దర్శి పిల్లితిరుపతి, డివిజన్ యువజన విభాగ అధ్యక్షులు దేవిరింటి మస్తాన్‌రెడ్డి, ముత్యాల దుర్గ, అబ్దుల్ రజాక్, నాగుల సత్యం, శివ, జావే దుద్దీన్, నర్సింహ, యోగిరాజు స్వామి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్య ఇస్తున్న ప్రభుత్వం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



చార్మినార్, ఆగష్టు 2 ప్రభాతవార్త : విద్యా రంగానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్య ఇస్తున్నదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు.పాతబస్తీ దారుషిఫా ఉర్దూమీయం ఉన్నత పాఠశాల ప్రహరి గోడ ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిందని,మొగల్‌పుర ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని,అదే విధంగా పాత బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ ఆయన మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూప్రభుత్వం విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోదీ, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## నేడు పాతబస్తీలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, ఆగష్టు 2 ప్రభాతవార్త : విత్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 3వ తేదీ బుధవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు ఖాజానగర్,ఖాజా పహాడి,బిఎన్‌కె కాలనీ, ఈద్గా,తాడ్‌బన్,నిజాం కాలనీ, సుల్తాన్‌షాహి, మేదర్‌వాడి, గౌలిపుర, సర్దార్ పటేల్ నగర్ బస్తీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు సిబిడి అధికారులు తెలిపారు.12 నుంచి 2 గంటలు వరకు రషీద్ కాలనీ,సోహెబ్ కాలనీ,మీరాలం చెరువు,శాస్త్రిపురం,హాసన్‌నగర్,3 నుంచి 5 గంటలు వరకు ముస్తాఫానగర్,అన్సారీరోడ్డు,గుల్జారానగర్,మహ్మదీయకాలనీ,ఓవైసీ హిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు తెలియజేశారు.

## హైదరాబాద్ పుట్‌బాల్ ఆటగాళ్లకు స్పెయిన్‌లో ఆడే అవకాశం

హైదరాబాద్, ఆగష్టు 2,ప్రభాతవార్త: హైదరాబాద్ పుట్‌బాల్ ఆటగాళ్లకు స్పెయిన్‌లో ఆడే అవకాశం కల్పించేందుకు సుదేవ ఒలింపిక్ రెసిడెన్షియల్ అకాడమీ నగరంలో ట్రయల్‌రన్ నిర్వహించనుంది. ఈనెల 5వ తేదీ రంగారెడ్డిజిల్లా, మెయినాబాద్ మండలం, మెనికేపల్లిలోని ఇన్ఫినిటీ అరేనా వ్ స్పోర్ట్స్‌లో ట్రయల్ నిర్వహించనున్నట్లు మహ్మద్ ఫైజ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఒకసారి నిర్వహించిన సుదేవ ఎఫ్‌సి రెండోసారి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2014లో అనుజ్‌గుప్తా, విజయ్‌హకారీ దీనిని స్థాపించారు. సుదేవ 2018లో స్పెయిన్‌లో తమశాఖను విస్తరించడంతో ఇక్కడివారికి అక్కడ ఆడే అవకాశం కలుగుతుంది. దేశవ్యాప్తంగా 8నగరాల్లో ఒలిపిక్స్ ట్రయల్‌రన్ నిర్వహించన్నుట్లు ఆయన చెప్పారు. అండర్ 13, అండర్ 15, అండర్ 18, అండర్ 22 ఇలా నాలుగు విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం

వివేకానందనగర్‌కాలనీ, ఆగష్టు 2, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ముఖ్యమంత్రి కెసిఆర్ నియంతృత్వ పాలన పట్ల విసిగిపోయారని, రానున్న రోజుల్లో అధికారంలోకి వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు ఉప్పల ఏకాంత్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ మూడో విడత ప్రజా సంగ్రామ యాత్ర సందర్భంగా యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న అనంతరం యాత్ర ప్రారంభమైంది. ఈ ప్రజా సంగ్రామ యాత్రకు మద్దతుగా రాష్ట్ర బిజెపి నాయకులు చౌదరి ధర్మారావు, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు ఉప్పల ఏకాంత్‌గౌడ్ మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలన నిజాం నియంతృత్వ పాలన పోవాలన్న రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావాలని అన్నారు. కెసిఆర్ కేంద్రంపై ఎంత విష ప్రచారం చేసిన 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది మాత్రం బిజెపి ప్రభుత్వమేనని, మళ్లీ దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీనేనని స్పష్టం చేశారు.

## పింగళి వెంకయ్య విగ్రహంపై నిర్లక్ష్యం తగదు

**బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్**

ధర్నాచౌక్, ఆగస్ట్ 2, ప్రభాతవార్త: ట్యాంక్‌బండ్‌పై నున్న పింగళి వెంకయ్య విగ్రహం పై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం ఎంతమాత్రం సమంజసంగా లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆరోపించారు. పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన ఒక ప్రకటన చేస్తూ మన జాతీయ జెండా రూపకర్త విగ్రహం ట్యాంక్‌బండ్‌పై కళతప్పి ఉందని, ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈనెల 13 నుండి 3 రోజుల పాటు దేశంలో ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకం ఎగురవేయాలని ప్రధాని పిలుపునిచ్చిన నేపధ్యంలో ఆ త్రివర్ణపతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య విగ్రహం వెల వెల బోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధాకరమని అన్నారు. విగ్రహం దిమ్మె ఒకవైపునకు వంగిపోగా, మరోవైపు మొక్కలు మొలిచాయని, తక్షణమే ప్రభుత్వం పింగళి వెంకయ్య విగ్రహంపై దృష్టి పెట్టి మరమ్మత్తులు చేయించాలని కోరారు.

## విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ప్రొఫెసర్లు

తార్నాక, ఆగస్టు 2 ప్రభాతవార్త: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పెంచేందుకు తొలిమెట్టు కార్యక్రమం ద్వార ప్రభుత్వం కృషి చేస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ ప్రొ. రవీంద్రనాథ్ కె. మూర్తి,యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ హెడ్ ప్రొ. డా.ఎ.రవీందర్, ప్రొ. శంకర్ పారుపల్లి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఫౌండేషన్ లిట్రసీ బేస్ లైన్ అసెస్మెంట్ పేరుతో ఏర్పాటు చేసిన రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఓయూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో టీఎస్.. ఎస్‌సిఇఈఆర్‌టీ ఓ.యూ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ కె. మూర్తి, యునివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొ. డా. ఎ.రామకృష్ణ, ప్రొ. శంకర్ పారుపల్లి మాట్లాడుతూ మూడో తరగతి చదివే పిల్లలకు ఇంగ్లీష్, మ్యాథ్స్, తెలుగు తధితర సబ్జెక్టుల్లో ఎక్కువగా ఫోకస్ పెట్టి వారంతంట వారే చదివే విదంగా తొలిమెట్టు కార్యక్రమం ద్వార అభ్యాసన సంక్షోభం నుంచి విముక్తి కలిగించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. మధుకర్ సుజాత, రిసోర్స్‌పర్సన్ ప్రభాకర్‌రెడ్డి, లలిత, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్, రూమ్ టు రీడ్ ప్రతినిధులు, ఓ.యూ ఎంఇడీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బీబీకా అలావాలో దట్టీలు సమర్పించిన డిసిపి



చార్మినార్, ఆగష్టు 2 ప్రభాతవార్త : మొహర్రం సంతాప దినాలు సందర్భంగా దక్షిణ మండలం డిసిపి పి.సాయి చైతన్య పాతబస్తీ డబీర్‌పురలోని బీబీకా అలావాను సందర్శించారు.బీబీకా ఆలంకు డిసిపి సాయి చైతన్య పూల దట్టీలు సమర్పించారు. కాగా మొహర్రం సంతాప దినాలు సందర్భంగా పాతబస్తీలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## దళితబంధు పథకంపై అబద్దపు ప్రచారం

వివేకానందనగర్‌కాలనీ, ఆగష్టు 2, ప్రభాతవార్త : దళితబంధు పథకంపై బిజెపి నాయకులు చేస్తున్న అసత్యపు ఆరోపణలు మానుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు కొమ్మగళ్ళ మోజేష్ అన్నారు. మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశంలో మాట్లాడుతూ బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుబాష దళితబంధు పథకంపై చేసిన ఆరోపణలపై ఆయన తీవ్రంగా ఖండించారు. దళితబంధు పథకం నిజమైన లబ్ధిదారులకు పథకం అందట్లేదు అంటూ అబద్దపు ప్రచారానికి పాల్పడుతున్న దళిత ద్రోహులకు తగిన గుణపాఠం చెప్తామని అన్నారు. అదేవిధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నియోజకవర్గంలో వందమంది లబ్ధిదారులకు పథకాన్ని అమలు జరిపి యూనిట్లు అందజేసిన ఘనత గాంధీది అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ దళితబంధు పథకం దళితులు బాగుపడాలని అమలు చేస్తే సహించలేని బిజెపి, కాంగ్రెస్ పార్టీలు పథకాన్ని ఆపేందుకు కుట్రపన్నుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో దళితబంధు పథకానికి ఏ ఆటంకం జరిగినా బిజెపి, కాంగ్రెస్ పార్టీలను దళితులు భూస్థాపితం చేసే రోజులొస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు, ఉద్య మకారులు రాములుగౌడ్, సిద్దయ్య, యాదగిరి, రవీందర్, ఇంత్యాజ్, రాజేందర్ పాల్గొన్నారు.

## నేడు పాతబస్తీలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, ఆగష్టు 2 ప్రభాతవార్త : విత్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 3వ తేదీ బుధవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు ఖాజానగర్,ఖాజా పహాడి,బిఎన్‌కె కాలనీ, ఈద్గా, తాడ్‌బన్,నిజాం కాలనీ, సుల్తాన్‌షాహి, మేదర్‌వాడి, గౌలిపుర, సర్దార్ పటేల్ నగర్ బస్తీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు సిబిడి అధికారులు తెలిపారు. 12 నుంచి 2 గంటలు వరకు రషీద్ కాలనీ,సోహెబ్ కాలనీ,మీరాలం చెరువు, శాస్త్రిపురం,హాసన్‌నగర్,3 నుంచి 5 గంటలు వరకు ముస్తాఫానగర్,అన్సారీరోడ్డు, గుల్జారానగర్,మహ్మదీ యకాలనీ,ఓవైసీ హిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు తెలియజేశారు.

**IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE, AT MALKAJGIRI**
**O.S.No. 134 OF 2020**

**BETWEEN:**
**State Bank of India, RACPC, Moula Ali, Hyderabad** ..Plaintiff

**AND**

Komapally Radha Krishna and another ...Defendants

To
01. **Komapally Radha Krishna** S/o. Venkataiah, R/o. Plot No.45, Survey No. 108, Suryanagar, Bank Colony, Mallapur, Hyderabad - 500076.
02. Prakash Golabh Singh Suryawanshi S/o. Gulabsingh R/o. D-6/54, DAE Colony, ECIL, Hyderabad - 500 062.

Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 15-09-2022 in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

**SMT. RAPAKA ARUNA,**
B.A, B.L.,
Advocate
11-78, Flat No.203,
Sri Sai Manssion, Pragathinagar,
Gaddiannaram, Hyderabad-60.
**Cell: 9030617991.**

**IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE, AT MALKAJGIRI**
**O.S.No. 136 OF 2020**

**BETWEEN:**
**State Bank of India, RACPC, Moula Ali, Hyderabad** ..Plaintiff

**AND**

Baaki Narasimha and others ...Defendants

To
01. Baaki Narasimha S/o. Muttaiah, Aged about 49 years, Occ: Employee, H.No.30-167/253/1, Chandragiri Colony, Malkajgiri, Hyderabad-500 056.
02. K.Hari Krishna S/o. Sriramulu Major, Occ: Employee, H.No. 2-127/140/2, Vijayapuri Colony, Uppal, Hyderabad.

Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 15-09-2022 in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

**SMT. RAPAKA ARUNA,**
B.A, B.L.,
Advocate
11-78, Flat No.203,
Sri Sai Manssion, Pragathinagar,
Gaddiannaram, Hyderabad-60.
**Cell: 9030617991.**

**IN THE COURT OF THE XVIII SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S.No. 620 of 2018**

BETWEEN:
**Bank of Baroda,** Chanchalguda Branch, Hyderabad, Rep. by its Chief Manager. **...Plaintiffs**

AND

**Mrs. C.Jaya Prada Reddy and another ...Defendants**

To,
**1. Mrs. C.Jaya Prada Reddy,** W/o Late C.Pratap Reddy, aged 50 years, R/o H.No.B23-11, Kaladera Colony, New Malakpet, Hyderabad.
**2. Mr. K.Jayanth Kumar Reddy,** S/o Mr. K.Jaya Reddy, aged Major R/o Ibrahimbad, Hanwad, Mahaboobnagar.

Please take notice that the above suit filed against you for recovery of money of Rs.7,10,537/- is posted to 10.08.2022 for your appearance at 10.30 A.M. You can appear either in person or through an advocate before the said court on the said date, failing which, the matter will be decided exparte.

// BY COURT ORDER //

**Sd/- SRINIVAS CHITTURU, Advocate,**
3-4-533, Barkatpura,
Hyderabad-500027.
Counsel for the Plaintiff

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client Mrs.Battula Sunitha Reddy W/o.Mr.Battula Srinivas Reddy, aged about 41 years, R/o.Flat No.203, Navya Residency, Veera Reddy Nagar, Near Vaijayanthi Nagar Theater, Nacharam, Uppal Mandal, Medchal - Malkajgiri District, is the owner of House No.1-75/4/35/A/1, on Plot No.35, consisting of stilt+2 Floors, in Survey No.155 Part, admeasuring 210.80 Sq.Yds., situated at Block No.9, Sai Maruthi Nagar, Boduppal Village, Medipally Mandal, Medchal-Malkajgiri District having purchased the same from Mr.N.Venkatesh vide a Sale Deed registered as document No. 20153/2021, Dt.24.12.2021. My client submit that she has lost the original link document i.e., Registered Sale Deeds Nos.3794/2004, Dt.29.03.2004 in favour of Mrs.G.Prabhaavathy. If any person/ persons, finds/has found the said document or has any objections, the same may be returned or informed to the undersigned within 7 days from the date of this publication.

**Mr.AilaKomaraiah,**
Advocate,
Additional Govt. Pleader (former), City Civil Court at Secunderabad
Legal advisor - SC/ST (PCR & POA), (Former)Hyderabad District
Opp. Secunderabad Nursing Home Hospital, West Marredpally, Secunderabad - 500026
**Mobile - 9849463287**

# ఉప్పల్‌లో బండి సంజయ్‌కు బిజెపి శ్రేణుల స్వాగతం



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న ఎన్వీఎస్ఎస్, కార్పొరేటర్లు శ్రీవాణి, చేతన తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** బిజెపి మూడో విడత ప్రజా సంగ్రామయాత్రలో భాగంగా ఉప్పల్‌కు చేరుకున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌కు పలువురు బిజెపి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, పలువురు బిజెపి సీనియర్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప్పల్ మహంకాళి ఆలయంలో బండి సంజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బిజెపి జెండా అవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మాట్లాడుతూ బిజెపి మూడో విడత ప్రజా సంగ్రామ యాత్రకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బిజెపి శ్రేణులు చేరుకుంటున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు శామీర్‌పేట ధర్మారెడ్డి, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణగౌడ్, యు.బి.చారి, బండారు వెంకట్రావ్, డా.మేకల శిల్పారెడ్డి, గోనె అంజయ్య, దేవసాని బాలచందర్, సోమశేఖర్‌గౌడ్, మార్నెని పణీందర్, కొల్లు బాలరాజు, రెవల్లి రాజు, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, గోనె శ్రీకాంత్, పంజాల శ్రవణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డును ఆక్రమించి విద్యుత్ స్తంభం ఏర్పాటు.. చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్ విభాగం..

## టిఆర్ఎస్ నాయకుడు ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం..

**నేరెడ్‌మెట్ ఆగస్టు 2 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గం నేరెడ్‌మెట్ డివిజన్ నేరెడ్‌మెట్ చౌరస్తా నుండి సప్తగిరి కాలనీకి వెళ్ళే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ భవన నిర్మాణదారుడు రద్దీగా ఉండే రోడ్డుపక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో స్థానికులు, వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. వివరాల్లోకి వెళితే నేరెడ్‌మెట్ ప్రధాన రహదారిలో ఓ నిర్మాణ దారుడు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులుచేసినా ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉన్నట్లు సమాచారం. దానినే అలుసుగా తీసుకున్న ఆ నిర్మాణదారుడు ఇప్పుడు ఏకంగా వాహనల రాకపోకలకు ప్రమాదకరంగా రోడ్డుపైనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన స్తంభం ఏర్పాటు చేస్తున్నారన, దీనివల్ల నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు తెలుపుతున్నారు. గ తంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు విషయంపై వాహన దారులకు ఇబ్బందులు కలుగుతాయని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్తంభం ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు ఉపేందర్‌రెడ్డి నిర్మాణదారుడికి సూచించినప్పటికి దానిని ఏ మాత్రం పట్టించుకోకుండా యదేశ్చగా ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మను రోడ్డుపై ఏర్పాటు చేయడం అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ నిర్మాణంపై చర్యలుతీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణాన్ని నిలిపి వేసి ప్రమాదాలకు తావు లేకుండా చూడాలని కోరుతున్నారు.



రోడ్డు ఆక్రమంచి స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# మంత్రి సబితాఇంద్రారెడ్డి చొరవతో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో రోడ్లకు రూ.188 కోట్లు మంజూరు

## సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, సబితలకు కృతజ్ఞతలు తెలిపిన రామిడి రాంరెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి కృషి వల్ల నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.188 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు కార్పొరేషన్‌లోని ఐదు ప్రధాన రోడ్లను దాదాపు 15.5 కిలో మీటర్ల మేర అభివృద్ధి చేయడానికి రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ రూ.188 కోట్లకు మంజూరు ఇచ్చింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబర్ 510 పేరిట ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇటీవల మంత్రి సబితారెడ్డి తన నియోజకవర్గంలోని ప్రధాన రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సిఎం కెసిఆర్, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌లను కలిసి విజ్ఞప్తి చేయడంతో స్పందించిన వారు నిధుల విడుదలకు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మంజూరైన 188 కోట్ల నిధుల నుండి ఆర్‌సిఐ రోడ్డు నుండి ఎయిర్ పోర్టు హోటల్ వరకు రోడ్డును రూ.32 కోట్లతో, మల్లాపూర్ క్రాస్ రోడ్డు నుండి కుర్మల్‌గూడ వరకు రూ.38 కోట్లతో, కుర్మల్‌గూడ నుండి నాదర్‌గుల్ వరకు రూ.40 కోట్లతో, నాదర్‌గుల్ నుండి తుర్కయాంజాల్ వరకు రూ.46 వరకు కోట్లతో, నాదర్‌గుల్ మెయిన్ రోడ్డు నుండి నాదర్‌గుల్, గుర్రంగూడ రోడ్డు వరకు రూ.32 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. కాగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ముఖ్య రహదారుల అభివృద్ధికి భారీ యెత్తున నిధులు మంజూరు చేసిన సిఎం కెసిఆర్‌కు, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌కు అదే విధంగా నిధుల కోసం కృషి చేసిన మంత్రి సబితారెడ్డికి బడంగ్‌పేట్ కార్పొరేషన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి : సిటిఓ రాధిక



ఉత్సవాలలో పాల్గొన్న సిటిఓ రాధిక, డిఇ వినయ్, అమరేశ్వర్

**మలక్‌పేట, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిహెచ్‌ఎంసి ట్రాన్స్‌పోర్ట్ విభాగం మలక్‌పేట సిటిఓ రాధిక, డిఇ వినయ్‌భూషణ్‌లు పేర్కొన్నారు. మలక్‌పేట సిటిఓ కార్యాలయం ఆవరణలో భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు అమరేందర్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు విచ్చేసి అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు శంకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పూజలు నిర్వహించారు. అనంతరం పోతరాజుల విన్యాసాలు, మేళతాళాలతో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. కార్యక్రమంలో నక్క రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా తల్లి పాల వారోత్సవాలు



గర్భిణీ మహిళలను సత్కరిస్తున్న కార్పొరేటర్లు గీత, రజితరెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ ఇందిరానగర్ కాలనీ కమ్యూనిటిహాల్‌లో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అల్వాల్ ప్రాజెక్ట్ ఉప్పల్ సెక్టార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్లు మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, బన్నాల గీత ప్రవీణ్ ముఖ్య అతిథిగా హజరైయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం ఆరోగ్యకరమన్నారు. తల్లిపాలు విధిగా తాగించాలని సూచించారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందజేయడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారని తెలిపారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించారు. తల్లులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన చర్యల గురించి ఐసిడిఎస్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం అధికారిణి శేషు పద్మ, పద్మ, పార్వతి, పలువురు అంగన్‌వాడి టీచర్లు, గర్భిణీ మహిళలు పాల్గొన్నారు.

## కల్వర్టులపై బ్రిడ్జిని నిర్మించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

**హయత్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** పెద్దఅంబర్‌పేటనుంచి కోహెడ వెళ్లేదారిలో వర్షాకాలంలో కల్వర్టుల మీదుగా వరద నీరు ప్రవహించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరుతూ మున్సిపాలిటీ నాయకులు మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ నాయకులు చెరుకూరి జగన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది వర్షాకాలంలో పైనుంచి వచ్చే వరదలతో చాక్రవాగు, చెన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ కల్వర్టులపై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తోందన్నారు. దీని కారణంగా వాహనాల రాకపోకలకు వీలుకావడం లేదన్నారు. వాహనాలు, పశువులు కొట్టుకు పోయిన సంఘటనలు సైతం ఉన్నాయని వివరించారు. వెంటనే కల్వర్టుపై బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి వెంటనే సంబంధిత అధికారులో ఫోన్‌లో మాట్లాడారు. 4 గ్రామాలకు సంబంధించిన ప్రధాన మార్గంలో రెండు బ్రిడ్జీల నిర్మాణం కోసం చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్టిమేషన్ పూర్తయ్యిందని, అతి త్వరలో బ్రిడ్జీల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు హామీ నిచ్చారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు సిద్ధంకి కృష్ణారెడ్డి, నాయకులు వద్దేపల్లి విజేందర్‌రెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, దేశరం బాలకృష్ణ, పిల్లినగేష్, అబ్దుల్ సత్తార్, కౌన్సిలర్ హరిశంకర్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి: గుమ్మకొండ విఠల్‌రెడ్డి



బియ్యం, పప్పులను అందజేస్తున్న గుమ్మకొండ విఠల్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలని నాగార్జున విద్యా సంస్థల ఛైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట్‌లోని నాగార్జున మాంటిస్సోరి, ఐఐటి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు మంగళవారం ఛారిటీ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందజేసిన సరుకులతో పాటు యాజమాన్యం మరికొన్నింటిని కలిపి దాదాపు 5 క్వింటాళ్ళ బియ్యం, 60 కిలోల కందిపప్పును నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమంలోని మానసిక వికలంగులు, అభాగ్యులకోసం అందజేశారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అనాథలు, అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవా భావనలను నేర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డి.మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు ఆశ్రమ నిర్వాహకుడు గట్టు గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో విజృంభిస్తున్న డెంగ్యూ కేసులు..!

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో గత కొద్ది రోజులుగా డెంగ్యూ కేసులు మళ్లీ విజృంభిస్తున్నాయి. కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండడం, పలు ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం ఉప్పల్‌లో మూడు డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదుకాగా మంగళవారం 8 కేసులు నమోదయ్యాయి. సోమవారం ఉప్పల్ విజయపురికాలనీలో ఒకటి, రామంతాపూర్ ఆర్టీసికాలనీలో ఒకటి, చిలుకానగర్ సమీపంలో ఒకరికి డెంగ్యూ పాజిటివ్‌గా అధికారులు గుర్తించారు. మంగళవారం మరో 8 కేసులు వచ్చాయి. డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలలో మందులు పిచికారి చేయడం, బ్లీచింగ్ చల్లడం చేస్తున్నారు. అయితే రామంతాపూర్ ఆర్టీసీ కాలనీలో డెంగ్యూ కేసులు నమోదు అయిన విషయం తెలిసిన వెంటనే స్థానిక ఆరోగ్యకేంద్రం, జిహెచ్‌ఎంసి సిబ్బంది వెళ్లి మందులు పిచికారి చేశారు. కాగా మున్సిపల్, పారిశుద్ధ్యం, వైద్యాధికారులు అర్భాటం కోసం తప్పా కేసులు నమోదు అవుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణకు ఫాగింగ్ వేగవంతం చేయాలని స్థానికులు సూచిస్తున్నారు.

## బండిసంజయ్ సంగ్రామ యాత్రకు తరలివెళ్లిన బిజేపీ శ్రేణులు



యాదాద్రి ఆలయంలో మంత్రి కిషన్‌రెడ్డి, కార్తికచంద్రారెడ్డి

**తార్నాక, ఆగస్టు 2 ప్రభాతవార్త:** యాదగిరి గుట్టలో బిజేపీ అధ్యక్షులు బండిసంజయ్ చేపట్టిన సంగ్రాయ యాత్రకు తార్నాక డివిజన్ బిజేపీ శ్రేణులు తరలివెళ్లారు. మాజీ మేయర్ బండకార్తికచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతో భారీగా తరలివెళ్లారు. అనంతరం కార్తికరెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, గౌతమ్‌రావుతో కలిసి లక్ష్మినరసింహ్మాస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టెంపుల్ సాయి, బండ శివారెడ్డి, చరణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఉప్పల పుస్తె మట్టెలు వితరణ

**ఎల్.బి.నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండగా నిలిచింది. వివాహానికి అవసరమైన పుస్తే మట్టెలను రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, స్వప్న దంపతులు అందజేశారు. మహబూబ్ నగర్ జిల్లా కొత్లాబాద్ గ్రామానికి చెందిన వడ్డె వెంకటమ్మ, క్రిష్ణయ్యల కూతురు స్వాతి వివాహానికి పుస్తెమట్టెలు, చీర, గాజులు అందజేసినట్లు చైర్మన్ తెలిపారు. సిఎం కేసీఆర్ కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా రూ. 1,00,116లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాములు, గోపాల్ పాల్గొన్నారు.

## జిల్లెలగూడలో ఘనంగా అమ్మవారి తొట్టెల ఊరేగింపు

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీ, ప్రగతినగర్ కాలనీల్లో సోమవారం రాత్రి అమ్మవారి తొట్టెల ఊరేగింపులు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటిసి జిల్లెల నరేందర్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షుడు సిద్దాల దశరథలు అమ్మవారికి పూజలు చేసి తొట్టెల ఊరేగింపులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి కిరణ్‌గౌడ్, బచ్చనమోని నర్సింహయాదవ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కర్నె రవికి ఉద్యమకారుల నివాళి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ సోదరుడు కర్నె రవి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నె రవి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి టిఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగోలు ఉద్యమకారులు సతీష్‌యాదవ్, గవ్వ శ్యామ్‌సుందర్‌రెడ్డి, మొగుళ్ళ జగన్‌మోహన్‌రెడ్డి, గుమ్మడి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పీ అండ్ టీ కాలనీవాసులతో సమావేశమై టన్నెలింగ్ పనులను గురించి వివరించారు. ఈ ప్రాంతం ముంపునకు గురికాకుండా భద్రతా చర్యలను గురించి వారికి వివరించారు. భారీ వర్షాలు కురిసినా ఈ ప్రాంతం మునిగిపోదనే విశ్వాసాన్ని కల్పించారు. తప్పుడు ప్రచారానికి ఎవరు ఆందోళనకు గురికావద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, రమేష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, రమణ రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల ఉత్సవాలు : రంగారెడ్డి



అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 2 ప్రభాతవార్త :** బోనాలఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. సలీంగనగర్‌లోని పోచమ్మ ఆలయంలో టిపిసిసి అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ చెకోలేకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారంరాత్రి అమ్మవారి ఫలహార బండిని మేళతాళాలు, పోతరాజు విన్యాసాలతో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలు సాంప్రదాయాలకు ప్రతిరూపాలని, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చెకోలేకార్ శ్రీనివాస్, నాయకులు కె.సూర్యప్రకాష్, మహేష్, కృష్ణ, యాదిలాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు జ్యూట్ బ్యాగ్‌లు : ఎమ్మెల్యే బేతి



హబ్సిగూడలో జ్యూట్ బ్యాగ్‌లను అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, గుడి మధుసూధన్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నివారించి జ్యూట్ బ్యాగ్‌లు ఉపయోగించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హబ్సిగూడ క్యాంపు కార్యాలయంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు, జిఎంఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుడి మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో తయారుచేసిన జ్యూట్ బ్యాగ్‌లను అవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణ కోసం కొత్తగా తయారు చేసిన జ్యూట్ బ్యాగ్‌ల గుడి మధుసూధన్‌రెడ్డి తయారు చేసి ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, కె.రవీందర్‌రెడ్డి, పల్లె నర్సింగరావు, ఎం.డి.ముస్తాక్, పిట్టల నరేష్, రవీందర్‌రెడ్డి, శంకర్, రాజు, శివ, శ్రీధర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని కార్మిక సంఘాల ఆందోళన

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు దుర మ్మరణం పాలైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుడు మీసాల సదానందం కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్పొరేషన్‌కు చెందిన చెత్త తరలించే ట్రాక్టర్ వాహనం పారిశుధ్య కార్మికుడు సదానందం మంగళవారం ఉప్పల్‌లోని చెత్త డంపింగ్ స్థలానికి వెళ్ళి వస్తూ ట్రాక్టర్‌ను బస్సు ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. దీంతో యూనియన్‌కు చెందిన నాయకులు మంగళవారం మధ్నాహ్నం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేశారు. దళిత పేద కుటుంబానికి చెందిన సదానందం కుటుంబ సభ్యులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డికి మెరుగైన వైద్య సహాయం అందించాలని వారు కోరారు. ఈ ఆందోళనలో యూనియన్ జిల్లా కార్యదర్శి కిషన్, రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, దాసరి బాబులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపి వేయడాన్ని నిరసిస్తూ ధర్నా



ధర్నాలో పాల్గొన్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతంలో గత 4 రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో గుడిసెవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. గుడిసెల ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అధికారులనిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గుడిసెవాసులు ఆస్మాన్‌ఘడ్‌లోని విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న అనంతర ం కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరా లేకపోవడంతో గుడిసెవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వీరేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత : అరుణ



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో మౌళికసదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. హౌజింగ్‌బోర్డుకాలనీలో డ్రైనేజీలు నిండిపోయి మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు పొంగి పొర్లుతుందన్న సమాచారంతో మంగళవారం వాటర్‌వర్క్స్ మేనేజర్‌తో కలసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో డ్రైనేజీ, త్రాగునీరు, రోడ్లు వంటి మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్, మల్లారెడ్డి, రఘు, శ్యాం, రవి, యాసీన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**తుర్కయంజాల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 23వ వార్డు సుందరయ్యనగర్‌కాలనీలో ఉచిత కంటి వైద్య శిబిరం, మెడికల్ కాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సిలర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కళ్యాణ్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నవారు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలకు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వనస్థలిపురం పీస్ వెల్ఫేర్ సొసైటి అధినేత డా. సురేష్ సహాయ సహకారాలతో ఈక్యాంపును నిర్వహించామని సుమారు 100 మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రంలో భాస్కర్, ఈశ్వ మెర్, అరుగబాబు, జార్జిముల్లర్, స్వర్ణలత, జాన పాల్, తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఎ, విఆర్వోలకు కాంగ్రెస్ పార్టీ అండ : మల్‌రెడ్డి రంగారెడ్డి



విఆర్ఎల ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న మల్‌రెడ్డి రంగారెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గత తొమ్మిది రోజులుగా విఆర్ఎలు అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ కార్యాలయంముందు చేస్తున్న సమ్మెకు ఆయన మంగళవారం హాజరై వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తుందని విఆర్ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి పదోన్నతులు కల్పిస్తామని గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీలో ప్రకటించారన్నారు. కాని నేడు విఆర్వోలతోపాటు విఆర్ఎలను కూడా తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత వ్వం విఆర్ఎ సంఘాలతో ఎలాంటి చర్చలు జరుపకుండా రాత్రికిరాత్రే సోమవారం జీఓలు జారీ చేసి విఆర్వోలను ఇతర శాఖలకు బదిలీ చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. విఆర్ఎ, విఆర్వోలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉండి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి బింగి దేవదాసుగౌడ్, నాయకులు కొత్త ప్రభాకర్ రెడ్డి, కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన ఉండాలి: మేయర్



తల్లిపాల వారోత్సవాల్లో ప్రసంగిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** తల్లి పాల ప్రాముఖ్యతను ప్రతి మహిళ తెలుసుకోవాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కోరారు. బాలాపూర్ వార్డు కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ తల్లి పాల వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తల్లి పాలు అత్యంత శ్రేష్టమైనవనీ పుట్టిన పిల్లలకు 6నెలల వయస్సు వచ్చే వరకు తల్లి క్రమం తప్పకుండా తల్లి పాలు త్రాగించాలని అన్నారు. తల్లి పాలలో పిల్లలకు కావాల్సిన రోగ నిరోధక శక్తి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ రంగారెడ్డి జిల్లా డిడబ్ల్యూఓ మోతీ, హయత్‌నగర్ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సిడిపిఓ వినీతదేవి, బాలాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ ఇందిర, అంగన్‌వాడి టీచర్లు, చిన్నారులు, తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

## రైతు శ్రేయస్సే సహకార బ్యాంకు ధ్యేయం : కొత్తకుర్మ సత్తయ్య



బిల్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

**తుర్కయంజాల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం రంగారెడ్డి జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులకు పంట అప్పులు సికె సిసి రూ 3.47 కోట్ల రూపాయలు. ఎల్‌టి అప్పులు 1.63 కోట్ల రూపాయలు మంజూరు చేసామన్నారు. సంఘ పరిధిలోని గ్రామాల వారు కరెంటు బిల్లు చెల్లించేందుకు కౌంటర్ సంఘం తరపున ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా చైర్మన్ బ్యాంక్ డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి, రైతు సేవ సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, చెక్క లక్ష్మమ్మ, కుతాడి నర్సింగరావు, కొండ్రు స్వప్న, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, సంఘ సీఈఓ వై.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు బ్యాగుల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా

**ఎల్.బి.నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** కొత్తపేట శ్రీ ప్రసన్న మహంకాళి అమ్మవారి దేవస్థానం 9వ వార్షికోత్సవ వేడుకలు బ్రహ్మశ్రీ పాలెం మనోహరశర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉత్సవాలసందర్భంగా దేవాలయ ప్రాంగణంలో లయన్స్ క్లబ్, జిహెచ్‌ఎంసి హార్టికల్చర్ సభ్యులు కలిసి మంగళవారం భక్తులకు ఉచితముగా 600 వందల తులసి, గోరింటాకు మొక్కలను ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌ను వాడటంవల్ల దుష్పరిణాముల గురించి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధిస్తూ భక్తులు పేపర్ బ్యాగులనే వాడాలని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట తెరాస అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, కొట్టం జంగయ్య యాదవ్, లయన్స్ క్లబ్ కొత్తపేట అధ్యక్షుడు డాక్టర్ బి.విజయరంగ, వజీర్ ప్రకాష్ గౌడ్, వరుణ్‌చంద్ర, వాసు గుప్త, మాధురి శ్రీనివాస్, మనవి అనురాధ, గీత, కందికొండ అనురాధ, యాదగిరిముదిరాజ్, జయశ్రీ, నోముల కృష్ణమూర్తిగౌడ్, రేపల్లె ప్రభాకర్, తిరుమల రెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.